www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 30 డిసెంబర్ 2025

5

కాకినాడ

యముని వేషధారితో అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట

'హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే నా దగ్గరకు వచ్చేస్తావ్' అంటూ యమధర్మరాజు వేషధారితో సోమవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. హైవేపై రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా సిఐ వైజిఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైవే రోడ్డును ఎక్కడ పడితే అక్కడ క్రాస్ చేయకండి, ప్రమాదాలను కొని తెచ్చుకోకండి అంటూ అవగాహన కలిగించారు.

అవగాహన కల్పిస్తున్న యముని వేషధారి

పట్టు పరిశ్రమలో సిబ్బంది కొరత

- ఉమ్మడి జిల్లాలో అరకొర సిబ్బంది
- కానరాని పట్టు పరిశ్రమ అభివృద్ధి
- తగ్గిన మల్బరీ తోటల సాగు

మల్బరీ తోటలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పట్టు పురుగుల పెంపకం రైతులకు ఎంతో లాభసాటిగా ఉంటుంది. వాటి పెంపకానికి మన నేలలు కూడా అనుకూలంగా ఉన్నాయి. అయినా ప్రభుత్వం, అధికారులు పట్టుపురుగుల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించకపోవడంతో వారు ముందుకు రావడం లేదు. అధికారుల సూచనలు, సలహాలు లేకపోవడంతో పట్టు పరిశ్రమపై మంచి లాభాలు ఉన్నప్పటికీ కొన్ని మండలాలకే పంట సాగు పరిమితం అయింది. పెద్దగా పెట్టుబడులు అవసరం లేనప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల పరిశ్రమ పట్టు తప్పుతోంది. ఖాళీ అవుతున్న ఉద్యోగాల స్థానంలో ఏళ్ల తరబడి భర్తీ చేయడం లేదు. కీలక అధికారులు, సిబ్బంది కొరతతో సమస్యలు ఏర్పడుతున్నాయి. దంతో రానురాను పట్టు పరిశ్రమ తగ్గుతూ వస్తుంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని మెట్ట మండలాలైన గొల్లప్రోలు, తుని, కోటనందూరు, శంఖవరం, రౌతులపూడి, తొండంగి, రంగంపేట, పెద్దాపురం, పిఠాపురం, బిక్కవోలు తదితర 26 మండలాల్లో మల్బరీ తోటలు సాగు చేస్తున్నారు. దాదాపు 4 వేల ఎకరాల్లో సుమారు 950 మంది రైతులు సాగు చేస్తున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కకూన్ మార్కెట్ ఉంది. ప్రతి నెలా ఆదాయం వచ్చే సాగు కాబట్టి రైతులు మరింత అవగాహన పెంచుకోవాలి. కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాలతో బాటు రంపచోడవరం డివిజన్లలో మల్బరీ పంట సాగు చేస్తున్నారు. రాష్ట్రంలో పట్టు పరిశ్రమ సంప్రదాయ జిల్లాలైన చిత్తూరు, శ్రీసత్య సాయి జిల్లాల తర్వాత 2022-23లో కాకినాడ జిల్లా పట్టు గూళ్ల ఉత్పత్తిలో 3వ స్థానంలో ఉంది.

నియామకాలు ఏవీ..?

జిల్లాలో పట్టు పరిశ్రమపై అభివృద్ధిపై ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదు. ఈ శాఖలో కొన్నేళ్లుగా నియామకాలు జరగకపోవడంతో అధికారులు, సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఉద్యోగ విరమణ పొందుతున్నారు తప్ప కొత్తగా నియామకాలు లేకుండా పోతున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధి డిప్యూటీ డైరెక్టర్ పోస్టు ఉన్నప్పటికీ వివిధ ఖాళీ పోస్టులు భర్తీ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నలుగురు పట్టు పరిశ్రమ అధికారులకు ఒకరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అసిస్టెంట్ పట్టు పరిశ్రమ అధికారులు కూడా నలుగురికి ఒకరు, సాంకేతిక అధికారులు 10 మందికి రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సహాయ సాంకేతిక సిబ్బంది 24 మందికి ఒక్కరు మాత్రమే ఉన్నారు. మొత్తంగా 43 మందికి 12 మంది మాత్రమే పని చేస్తుండగా 31 ఖాళీ పోస్టులు ఉన్నాయి. అనేక ఏళ్లుగా ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఉన్న వారిపైనే అదనపు భారం పడుతుంది. రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చేవారు కరువవుతున్నారు

ఆర్ఎస్‌కెలకే విఎస్ఎలు పరిమితం

ఇటీవల సచివాలయ ఉద్యోగాల్లో కొంత మంది గ్రామ సెరి కల్చర్ సహాయకులను ప్రభుత్వం నియమించింది. గొల్లప్రోలు మండలంలో ముగ్గురు, ప్రత్తిపాడు మండలంలో ఇద్దరు, శంఖవరం, రౌతులపూడి, తుని, కోటనందూరు, రాజవొమ్మంగి, గంగవరం మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున ఈ పోస్టులను భర్తీ చేశారు. అయితే వారు వ్యవసాయ శాఖ పరిధిలోనే విధులు నిర్వహిస్తున్నారు. పూర్తిగా రైతు సేవా కేంద్రాలకే పరిమితం కావడంతో మల్బరీపై రైతులకు ఎలాంటి సలహాలు, సూచనలు అందడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏడి స్థాయి అధికారులు క్షేత్ర సందర్శన చేసేందుకు సరైన వాహనాలు లేవు. ఉమ్మడి జిల్లా కార్యాలయాన్ని అద్దె భవనంలో కాకినాడలోని ఒక అపార్ట్మెంట్లో చిన్న ప్లాట్లో నిర్వహిస్తున్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయడం లేదు



జిల్లాలో సెరి కల్చర్ శాఖలో ఖాళీ పోస్టులు కొన్నేళ్లుగా భర్తీ కావడం లేదు. దీని వల్ల ఉన్నతాధికారులు, సిబ్బందిపై భారం పడుతోంది. ఖాళీ పోస్టుల విషయంపై ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే పోస్టులు భర్తీ అవుతాయని ఆశిస్తున్నాము.

- బి.గీతారాణి, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి.

అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఎంఎల్ఎ కొండబాబు

అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారాలు ఇచ్చేలా అధికారులు పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జిల్లాస్థాయి కార్యక్రమం సోమవారం కలెక్టరేట్ వివేకానంద గ్రీవెన్స్ హాల్లో నిర్వహించారు. ట్రైనీ కలెక్టర్ మనీషా, జెడ్‌పి సిఇఒ లక్ష్మణరావు, సిపిఒ త్రినాథ్, జిజిహెచ్ ఎడి ఎస్.శ్రీధర్, డిఎంహెచ్ఒ డాక్టర్ జె.నరసింహనాయక్‌తో కలిసి జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ప్రజల నుంచి వినతులను, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని జెసి అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డుల్లోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై మొత్తం 400 అర్జీలు అందాయి. కాకినాడ నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు వేగవంతమైన పరిష్కారాలు అందించాలనే లక్ష్యంతో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు సిటీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సోమవారం పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణం, అన్నదాన సమాజంలోని ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ కెటి.సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, టిడిఆర్ఎ శైలజ, డిసిపి కృష్ణారావు, డి.కనకారావు, మల్లిపూడి వీరు, గదుల సాయిబాబా, రహీంబాబు, గుజ్జు దుర్గాలక్ష్మణరావు, బంగారు సూర్యావతి సత్యనారాయణ, చింతలపూడి రవి, రిక్క లక్ష్మి పాల్గొన్నారు.

ప్రత్యేక బోగీల్లో ప్రయాణికుల తరలింపు

ప్రజాశక్తి-సామర్లకోట

బాధిత ప్రయాణికులకు భోజనాలు అందిస్తున్న క్లబ్ సభ్యులు

యలమంచిలిలో రైలు బోగీల దహనం సంఘటనలో ప్రయాణికులను సోమవారం సామర్లకోటలో ప్రత్యేక బోగీల్లో తరలించారు. ప్రమాదం నుంచి తప్పించుకున్న సుమారు 144 మంది ప్రయాణికులను ఆర్‌టిసి బస్సుల్లో సామర్లకోట రైల్వే స్టేషన్‌కు అధికారులు తరలించారు. ప్రమాద సంఘటనతో నిలిచిపోయిన ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ రైలు కాలిపోయిన ఎసి బోగీలను తప్పించి సామర్లకోట రైల్వే స్టేషన్‌కు ఉదయం 9 గంటలకు చేరుకుంది. నాలుగు ప్రత్యేక బోగీలను అప్పటికే రప్పించి అధికారుల సిద్ధం చేశారు. ఎర్నాకులం రైలుకు బోగీలను అనుసంధానించి ప్రయాణికులను వాటలిలో ఎక్కించి పంపించారు. ప్రయాణికులకు సామర్లకోట రైల్వే స్టేషన్లో అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు టిఫిన్లు, వాటర్ బాటిల్స్, టీ కాఫీలు అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అమలకంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 144 మంది ప్రయాణికులకు భోజనాలు ప్యాకింగ్ చేసి ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి డి.శ్రీహరిరాజు, సిఐ ఎ.కృష్ణ భగవాన్, ఎస్ఐ పివిఆర్.మూర్తి, అడపా గరగారావు, సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ పాల్గొన్నారు.

కల్వర్టు పనులను అడ్డగించిన స్థానికులు

నాసిరకం కల్వర్టు పనుల అడ్డగింత

ప్రజాశక్తి-సామర్లకోట

స్థానిక జగదీశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న కల్వర్టు పనులు అతి నాసిరకంగా ఉన్నాయని స్థానికులు సోమవారం పనులను అడ్డగించారు. జనసేన పార్టీ 14వ వార్డు ఇన్‌ఛార్జి అల్లం అయ్యప్ప, 8వ వార్డు ఇన్‌ఛార్జి కానూరి పవన్ కుమార్ ఆధ్వర్యంలో స్థానికులు పనులను అడ్డగించారు. రెండడుగుల వెడల్పుతో కల్వర్టు గోడ నిర్మించాల్సి ఉండగా రాత్రికి రాత్రి కేవలం 9 అంగుళాలు నిర్మించారని, 12 ఎంఎం ఇనుప ఊసలు వాడవలసి ఉండగా, దారుణంగా 6 ఎంఎం ఊసలతో కల్వర్టు స్లాబ్ కట్టడం ఎంతవరకు సమంజసం అనిప్రశ్నించారు. తమకు సంబంధం లేదని కాంట్రాక్టర్ చెప్పిన విధంగా పనులు చేస్తున్నామని సిబ్బంది జవాబు ఇచ్చారు. దీనిపై అల్లం అయ్యప్ప మున్సిపల్ ఎఇకి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కార్యాలయం అతి సమీపంలో నిర్మాణం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు అడ్డగించడంతో పనులు నిలుపుదల చేసి సిబ్బంది వెళ్లిపోయారు.

కార్టూ'నిజం'



సిఐటియు మహాసభపై ప్రచార జాతాలు

సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం పలుచోట్ల జాతాలు నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆటో ప్రచార జాతాను చింతపల్లి అజయ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ జాతా వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట, సూర్యారావుపేట, సర్పవరంలో పరిశ్రమలు, కార్మిక నివాస ప్రాంతాల్లో సాగింది. వలసపాకల సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి తొట్టిపూడి రాజా, తిరుమలశెట్టి నాగేశ్వరరావు మాట్లాడారు. కార్మికవర్గ ఐక్యత కోసం సిఐటియు ఏర్పడి నేటికి 55 ఏళ్లు పూర్తిచేసుకుందని, ఎపిలో తొలిసారి జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జనవరి 4న చలో విశాఖకు వేలాదిగా కార్మికవర్గం కాకినాడ నుంచి తరలి రావాలని పిలుపు ఇచ్చారు. వాసంశెట్టి సూర్యం, ఎవి.కృష్ణాజీ, మురళి, బి.రాంబాబు దుర్గాప్రసాద్, సాయి, రాజు, బి.సింహాద్రి, రామకృష్ణ, విశ్వనాథ్, శ్రీనివాస్, కె.సింహాద్రి, కొప్పన ఈశ్వరరావు, నాగేంద్ర, సురేంద్ర, వెంకటేష్, బండియ్య పాల్గొన్నారు.

పెద్దాపురంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ సినిమా సెంటర్, మెయిన్ రోడ్, వెంకటేశ్వర స్వామి గుడి సెంటర్, ఆంజనేయ స్వామి గుడి సెంటర్, మున్సిపల్ సెంటర్, దర్గా సెంటర్, గుర్రాల సెంటర్ మీదుగా కొత్తపేట వరకూ కొనసాగింది. సిఐటియు నాయకులు సిరపరపు శ్రీనివాస్ మాట్లాడారు. సిఐటియు మండల అధ్యక్షుడు గడిగట్ల సత్తిబాబు, సిఐటియు నాయకులు గూనూరి రమణ, తైనాల శ్రీను, రామారావు, వడ్డి సత్యనారాయణ, గరగపాటి పెంటయ్య, ఎన్.సూరిబాబు, కె.అప్పన్న, ఎస్.బంగారు రాజు, ఎం.నాగు, తాడిశెట్టి గంగ, ఎస్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తుని సిఐటియు ప్రచార జాతాకు సిఐటియు తుని కన్వీనర్ నక్కల శ్రీనివాస్, పలు యూనియన్ల నాయకులు ధనలక్ష్మి, సుబ్బలక్ష్మి, గొర్ల వెంకటరమణ, అప్పారావు, వీరబాబు, కృష్ణ, రాజా, రమేష్, పవన్, మట్ల కృష్ణ, బత్తిని నాగేశ్వరావు స్వాగతం పలికారు. గొల్ల అప్పారావు సెంటర్లో సిఐటియు నాయకులు శ్రీనివాస్ మాట్లాడారు.

పెద్దాపురంలో సిఐటియు ప్రచార జాతా

కాకినాడ రూరల్‌లో..

కోటనందూరులో సిఐటియు జాతా

అవగాహన కల్పిస్తున్న కమిటీ సభ్యులు

న్యూ ఇయర్ వేడుకల్లో మద్యం వద్దు

ప్రజాశక్తి-పిఠాపురం

మద్యం, మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని గోకివాడలో మద్యం, మాదకద్రవ్యాలు లేని నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు వేమగిరి తలుపులయ్య మాట్లాడుతూ నూతన సంవత్సరం పేరుతో యువత మద్యం మాదకద్రవ్యాలు సేవించి మత్తులో వాహనాలు అతివేగంతో నడిపి వారి వారి ప్రాణాలు పోగొట్టుకుని తల్లితండ్రులకు తీరని శోకాన్ని మిగులుస్తున్నారన్నారు. డిసెంబర్ 31వ తేదీ ఉదయం నుండి 2026 జనవరి ఒకటవ తేది రాత్రి వరకూ మద్యం షాపులను పూర్తిగా మూసివేయ్యాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లోడ సూరిబాబు, వేమగిరి పాప, మోర్త లోవ, ముప్పిడి నానాజీ, చెల్లూరి కొండమ్మ, చిన్నారి, భవాని, మరియమ్మ, ప్రేమలత, బేబీ, సూర్య కుమారి, మహాలక్ష్మి, రాజు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - పెద్దాపురం, యు.కొత్తపల్లి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఈ వివాహాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని న్యాయవాది కె.గణేష్ అన్నారు. బాల్ వివాహ్ ముక్త్ భారత్ క్యాంపెయిన్‌లో భాగంగా సోమవారం స్థానిక ట్రినిటీ హైస్కూల్లో హెచ్ఎం వి.భరత్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన ప్రసంగించారు. 18 ఏళ్ల లోపు ఆడపిల్లలు, 21 ఏళ్ల లోపు మగ పిల్లలకు చట్టరీత్యా వివాహాలు నేరం అన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు, ఆరోగ్య సమస్యలు వంటి వాటిపై వివరించారు. పిఎల్‌విబి.సూర్యనారాయణమూర్తి మాట్లాడారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

యు.కొత్తపల్లి బాల్యవివాహాలు నేరమని మండల లీగల్ సర్వీస్ అథారిటీ ప్యానెల్ అడ్వకేట్ దాసరి రమేష్ బాబు, వాసంశెట్టి అప్పారావు, పారా లీగల్ వాలంటర్ నూలు వరలక్ష్మి తెలిపారు. మూలపేటలో షిలో చర్చ్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు కేసాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. చర్చ్ ఉపాధ్యక్షుడు వాసంశెట్టి లొండలు, కోశాధికారి స్థాయానందం, విద్యార్థులు పాల్గొన్నారు.

యు.కొత్తపల్లిలో అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

బుద్ధిస్ట్ సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తాళ్లరేవు

బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా 2026 నూతన క్యాలెండర్‌ను సోమవారం పోలేకుర్రు పంచాయతీ జైభీమ్ పేట జక్కల వారి తోటలో ఆవిష్కరించారు. త్రిరత్న బౌద్ధ సొసైటీ, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా మండల అధ్యక్షులు జక్కల ప్రసాద్ బాబు, పినిపే నాగేంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రజా సంఘాల మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు హాజరై క్యాలెండర్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ బుద్ధుని బోధనలు మానవాళి మనుగడకు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఆయన బోధనలలో శాంతి, అహింస నేటి సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. బౌద్ధ ధర్మ వ్యాప్తికి బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎండియూడబ్ల్యూఎ అధ్యక్షులు కన్నీడి వెంకటరమణ, కమిడి ఈశ్వరీబాయి, జక్కల అఖిల్, గుత్తాల సుబ్రహ్మణ్యం, దడాల రామకృష్ణ, దున్నా సందీప్, కాశి కరుణ, తాటిపాక దుర్గబాబు, దున్నా అనిల్, కాశి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ఏసుక్రీస్తు సన్మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని, క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయం కావాలని ఎంఎల్ఎ వరుపుల సత్య ప్రభ పేర్కొన్నారు. మండలంలో లంపకలోవలో క్రిస్మస్ వేడుకల్లో ఎంఎల్ఎ పాల్గొన్నారు. కేక్ కట్ చేసి ప్రజలందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొంతిన సురేష్, పంది దొరబాబు, చక్కపల్లి మందీశ్వరరావు, చక్కపల్లి నవీన్ పాల్గొన్నారు.

పద్మజ, మూర్తి దంపతులకు పురస్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

మూర్తి పద్మజ దంపతులు

పద్మజ, మూర్తి ఉపాధ్యాయ దంపతులు 'ఇంటర్నేషనల్ కపుల్ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు ఎంపికయ్యారు. అంతర్జాతీయ స్థాయిలో పని చేస్తున్న 'ఏ వాక్ త్రూ ఎడ్యుకేషన్' సంస్థ 2025 సంవత్సరానికి గాను ఈ అవార్డును వర్చువల్ విధానంలో వారికి అందజేశారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో నైజీరియా, నెదర్లాండ్స్, కెన్యా, అమెరికా, స్విట్జర్లాండ్, ఆఫ్రికా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, గ్రీస్, ఫిలిప్పీన్స్, రష్యా, యుగోస్లేవియా, ఇండోనేషియా తదితర దేశాలకు చెందిన వివిధ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, ప్రిన్సిపల్స్ తరచుగా విద్యా గోష్టుల్లో పాల్గొంటుంటారు. కోవిడ్ అనంతరం విద్యార్థుల్లో ఏర్పడిన ప్రవర్తనా మార్పులు, భవిష్యత్ తరాల విద్యా విధానం వంటి అంశాలపై ఉపాధ్యాయులు యాళ్ల పద్మజ, నల్లం అచ్యుత రామచంద్రమూర్తి దంపతులు దీర్ఘకాలంగా చురుకుగా పాల్గొని విలువైన సూచనలు, విశ్లేషణలు అందించడంతో ఈ గౌరవానికి ఎంపిక చేసినట్టు ఆ సంస్థ సిఇఒ డాక్టర్ గ్లోరియా అయోగు తెలిపారు. డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, రావు చిన్నారావు, ఉపాధ్యాయులు పద్మజామూర్తి దంపతులను అభినందించారు.

గుత్తులవారిపాలెం రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -తాళ్లరేవు

గుత్తులవారిపాలెంలో రూ.25 లక్షల ఉపాధి నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. రంగనాయకపురం గంగాలమ్మ గుడి వద్ద నుంచి గుత్తులవారిపాలెం రామాలయం వరకూ ఈ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులకు ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, ఎంపిపి రాయుడు సునీత ఇటీవల భూమి పూజ చేయగా, సోమవారం కూటమి నాయకులు నడింపల్లి వినోద్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గుత్తుల సత్యనారాయణ, మల్లేశ్వరరావు, వనచర్ల శ్రీనివాస్, రైతులు మణి రాజు, కృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆనంద్, కాంట్రాక్టర్ బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న వినోద్

సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ పరిధిలో సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులు వేగవంతంలో అధికారుల జాప్యం తగదని పలువురు కౌన్సిలర్లు అన్నారు. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ మెయిన్ రోడ్డు వినాయకుని గుడి సెంటర్లో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చివేసి ఏళ్లు గడుస్తున్నా ఈనాటికీ కాంప్లెక్స్ పునర్నిర్మించలేదన్నారు. దీనివల్ల మున్సిపాలిటీ లక్షల్లో ఆదాయం నష్టపోతోందన్నారు. సోలార్ సిస్టం వినియోగించడం వల్ల మున్సిపాలిటీకి రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతుందన్నారు. పెద్దాపురం పట్టణ పరిధిలో సెంట్రల్ లైటింగ్ అభివృద్ధికి నిధులు సమకూర్చి సక్రమంగా అభివృద్ధి పనులు చేపట్టడం లేదన్నారు. కౌన్సిలర్ యర్రా శ్రీను మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ నిధులతో చేపట్టిన వర్కులు కాంట్రాక్టర్లు పూర్తి చేయడం లేదన్నారు. కౌన్సిలర్ కనకదుర్గ మాట్లాడుతూ తన వార్డులో డ్రైన్ల పూడికతీత పనులు చేపట్టాలన్నారు. వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఎఇ పివి.సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - కొవ్వూరు

గోదావరి నదిలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని కొవ్వూరు పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. పట్టణంలో కొత్త శివాలయం సమీపంలో నదిలో తేలియాడుతున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇచ్చారన్నారు. మృతుడు అయ్యప్ప మాల ధరించి ఉన్నాడని తెలిపారు. వయసు సుమారు 35 నుంచి 47 ఏళ్లు ఉండొచ్చన్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. మృతుని శరీరంపై నలుపు రంగు చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం పూర్తిగా పాడై ఉందన్నారు. సుమారు మూడు నాలుగు రోజులకు క్రితం మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు. వివరాల కోసం కొవ్వూరు పట్టణ పోలీస్ స్టేషన్లో లేదా 9440796622 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-కడియం

మండల కేంద్రమైన కడియం రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు.కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు ఆదేశానుసారం ఎస్ఐ ధనలక్ష్మిప్రసన్న, ఎఎస్ఐ నాగేశ్వరరావు, కానిస్టేబుల్స్ మల్లికార్జున, వెంకట్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మండలంలోని జేగురుపాడు గ్రామ శివారు పాముల మెట్ట, జగనన్న కాలనీకి చెందిన జగతా గంగాధరం కుమారుడు జగతా శివ(19) ప్రమాదంలో మరణించినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సారా తయారీ కేంద్రాలపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి-కోటనందూరు

భీమవరపుకోట శివారులో నాటుసారా తయారీ కేంద్రాలపై ఎస్ఐ టి.రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో 20 లీటర్ల నాటుసారా, కెమికల్ అనాలిసిస్, 100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు టివిసి ట్రస్ట్ సాయం

ప్రజాశక్తి - కడియం

ఆపదలో ఆదుకోవడాన్ని మించిన సంతృప్తి మరొకటి లేదని టివిసి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి అన్నారు. మండలంలోని దోసాలమ్మ కాలనీలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో యాల్లంశెట్టి సముద్రుడు, లక్ష్మిలకు చెందిన ఇల్లు పూర్తిగా కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. విషయం తెలుసుకున్న టివిసి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. రూ.10వేల నగదు, 25 కేజీల బియ్యం, దుప్పట్లు, దుస్తులు సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో తాడాల కృష్ణకుమార్, కొత్తపల్లి శివాజీ, సాపిరెడ్డి కామేష్, చిరుకూరి రామకృష్ణ, గణేశుల చక్రవర్తి, మార్గాని బలరాం, తూపాటి వరాలు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెరవలి

స్థానిక మండల వనరుల కేంద్రంలో 2026 యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను మండల విద్యా శాఖ అధికారులు బి.స్వరూప్, షేక్ సూర్జన్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వి.వెంకటరమణ, రాష్ట్ర కౌన్సిలర్ పి.వెంకటరాముడు, మండల అధ్యక్షుడు పి.నరేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి డివిఎస్ఆర్.తారాకృష్ణ, సహ అధ్యక్షురాలు వి.రాధిక, జిల్లా మహిళా సబ్ కమిటీ సభ్యులు టిసిహెచ్.సుమమ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవివిఎస్ఆర్.రాజేశ్వరరావు, కార్యదర్శులు వి.శ్రీనివాసరెడ్డి, పి.వినయ్‌కుమార్, షేక్ సూరాసాహెబ్, పతంజలి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారం నాణ్యతగా ఉండాలని అయా శాఖల అధికారులకు రాజమహేంద్రవరం ఆర్‌డిఒ కార్యాలయ పరిపాలన అధికారి ఎం.సుజాత సూచించారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో వివిధ సమస్యల పరిష్కారం కోసం ఐదు అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నిర్ణీత గడువులోగా అర్జీలను పరిష్కరించాలన్నారు. పెండింగ్ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వాట్సప్ గవర్నెన్స్ నెంబర్ 9552300009 ద్వారా కూడా ప్రజలు సత్వర ప్రభుత్వ సేవలు పొందొచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె సూచించారు. ఆయా శాఖల వారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ రాజరాజేశ్వరి విద్యాలయ విద్యార్థుల ఆర్థిక సాయం

చాగల్లు : మండలంలోని చాగల్లు శ్రీ రాజ రాజేశ్వరి విద్యాలయ విద్యార్థులు కొవ్వూరులోని ఆశ్రయ ఫౌండేషన్‌లోని క్యాన్సర్ రోగుల కోసం రూ.58వేల ఆర్థిక సాయాన్ని అందించారు. విరాళాలు సేకరించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ శాంతి నికేతన్ కరెస్పాండెంట్ మల్లిన ప్రవీణ్‌కుమార్, ఆశ్రయ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ విజయ్‌కుమార్, స్కూల్ కరస్పాండెంట్ వల్లిపల్లి వెంకటరామారావు, హెచ్ఎం కరీం, ఉపాధ్యాయులు కిషోర్ వినయ్ గౌడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

తుని మున్సిపాలిటీ బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి-కోటనందూరు

తుని మున్సిపాలిటీ 2026-27 వార్షిక బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రారంభ నిల్వ రూ.2.97 కోట్లు కాగా, రాబడి అంచనాను రూ.17.36 కోట్లుగా చూపించారు. ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం వార్షిక బడ్జెట్ రూ.20.33 కోట్లు కాగా ఖర్చు పోను 2026-27కు గాను రూ.59 లక్షలు మిగులుగా అంచనా వేశారు. సోమవారం చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అధ్యక్షతన వార్షిక బడ్జెట్ ఆమోదించారు. అనంతరం కౌన్సిల్ సాధారణ సమావేశం ప్రారంభమైంది. మొత్తం 37 అంశాల ఎజెండాను కౌన్సిల్ ముందు ఉంచగా అన్ని అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 28వ వార్డుల్లో కల్వర్టులు నిర్మించాలని కౌన్సిలర్ చింతకాయల భారతి చైర్‌పర్సన్‌ను కోరారు. తుని పట్టణ తొలి మహిళా చైర్‌పర్సన్ గా సేవలందించిన బొండా రత్నావతి ఇటీవల కాలంలో కన్నుమూయడంతో కౌన్సిల్ సభ్యులు ఆమెకు ఘనంగా నివాళి అర్పించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, అధికారులు పాల్గొన్నారు.

కబడ్డీలో జిల్లా జట్టుకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి - సామర్లకోట

కర్నూలు జిల్లాలో 72వ పురుషుల అంతరాష్ట్ర కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కాకినాడ జిల్లా జట్టు మొదటి స్థానం సాధించింది. ఈ మేరకు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసరావు సోమవారం వివరాలు తెలిపారు. ఎంతో ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోటీల్లో జిల్లా జట్టు అత్యంత ప్రతిభను కనబరిచి ఛాంపియన్ షిప్‌ను సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర మొత్తం మీద 26 జిల్లాలకు చెందిన టీములు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు చెప్పారు. జిల్లా జట్టును అసోసియేషన్ సభ్యులు, ఇంటర్నేషనల్ కోచ్ సాయిప్రసాద్, ఇంటర్నేషనల్ రిఫరీ బోగిళ్ల మురళీకుమార్, నిమ్మకాయల కిరణ్ కుమార్, ఇంటర్నేషనల్ ప్లేయర్స్ శ్వేత, కె.శ్రీనివాస్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు వివి.శ్రీనివాస్, తాళ్లూరి వైకుంఠం అభినందనలు తెలిపారు.

ప్రెస్ క్లబ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ప్రెస్ క్లబ్ నూతన క్యాలెండర్‌ను సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒ మాధవరావు, డిటి భాను కుమార్ ద్వారా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రాకుర్తి రాంబాబు, కార్యదర్శి నల్లజర్ల వినాయక్, కోశాధికారి రాయవరపు వీరబాబు, గౌరవాధ్యక్షుడు మొల్లు సూర్యనారాయణ, సీనియర్ జర్నలిస్టు అడపా వెంకటరావు, శ్రీరామ్, చవ్వాకుల ఈశ్వరరావు, బొద్దిరెడ్డి బుజ్జిబాబు, ఐతి చింటూ, పొన్నాడ సత్తిబాబు, పర్ ద పీపుల్ ఫౌండేషన్ చైర్మన్ గుణ్ణం లక్ష్మణరావు పాల్గొన్నారు.

వాసిరెడ్డి జమీలుకు పరామర్శ

ప్రజాశక్తి-రౌతులపూడి

వైసిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీలు తండ్రి వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందడంతో మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, బూడి ముత్యాల నాయుడు పలువురు వైసిపి ముఖ్య నాయకులు జమీలును సోమవారం పరామర్శించారు పరామర్శించిన వారిలో లాలం బాబ్జి, జెడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి, సర్ధం శ్రీను, గొల్లు వెంకటరమణ, వాసిరెడ్డి భాస్కర బాబు పాల్గొన్నారు.

పురస్కారం అందుకున్న ఆదిత్య లియో క్లబ్ సిబ్బంది

ఆదిత్య లియో క్లబ్‌కు పురస్కారం

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీ లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రాంతీయ సదస్సులో ఆదిత్య విశ్వవిద్యాలయ లియో క్లబ్ విశేష ఘనత సాధించిందని డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. కాకినాడలో నిర్వహించిన సదస్సులో ఆదిత్య సూరంపాలెంకు 'బెస్ట్ లియో క్లబ్' అవార్డు ప్రదానం చేయగా, అదే క్లబ్‌కు మార్గదర్శకత్వం వహిస్తున్న ప్రొఫెసర్ నులు నరేష్‌కు 'బెస్ట్ లియో అడ్వైజర్' అవార్డు లభించిందని తెలిపారు. లియో క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు, గ్రామీణాభివృద్ధి చర్యలు, యువతలో సేవాభావాన్ని పెంపొందించడంలో లియో క్లబ్ ఆదిత్య సూరంపాలెం చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డులు అందజేశారు. ముఖ్యంగా బాల్యవివాహాల నిర్మూలన, అవగాహన ర్యాలీలు, సేవా కార్యక్రమాలలో క్లబ్ చురుకైన పాత్ర పోషించిందని ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.రమేష్ అభినందించారు.

వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

150 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

చంద్రమాంపల్లి పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 150 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పాస్టర్ ప్రశాంత్, గ్రామ టిడిపి నాయకులు రేలంగి బుజ్జి ఆధ్వర్యంలో వాసన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 22 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. 45 మందికి కళ్ళజోళ్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు, కొత్తెం వెంకట శ్రీనివాసరావు, రేలంగి వెంకటరావు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఐలు నాయకులు

డికెవిఎస్‌లో ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ

డికెవిఎస్ జూనియర్ కాలేజ్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డి.లోవకుమారి సోమవారం ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ నిజాయితీగా ప్రజా సమస్యలపై, ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వాలకు తెలియజేస్తూ ప్రజలు పక్షాన నిలుస్తున్నటు పత్రిక ప్రజాశక్తి క్యాలెండర్‌ను తాము ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపల్ ఆంధ్ర సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం ప్రజాశక్తి సిబ్బంది టి.శ్రీహరి, సురేష్ కుమార్, చిరంజీవి, మంజన్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న తుని పట్టణ పోలీసులు

లాడ్జిల్లో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి-కోటనందూరు

తుని పట్టణంలోని లాడ్జీల్లో సోమవారం పట్టణ సిఐ ఎం.గీతారామకృష్ణ, ఎస్ఐ యు.పాపారావు తనిఖీలు చేపట్టారు. అసాంఘిక కార్యక్రమాల నివారణకు, నేరస్తులను పట్టుకోవడానికి ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని సిఐ తెలిపారు. లాడ్జీల్లో ఉన్న వారి వేలిముద్రలను సేకరించి పాత నేరస్తులను గుర్తిస్తున్నామని తెలిపారు. లాడ్జి యజమానులు నిబంధనలను పాటించాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, లాడ్జికి వచ్చే వారి గుర్తింపు కార్డులను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

మరిడమ్మకు బంగారు ఆభరణాల సమర్పణ

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారికి సోమవారం పట్టణానికి చెందిన పడాల రామలక్ష్మి, లింగం నాగమణి బంగారు ఆభరణాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, వేద పండితులు ఐవి.ప్రసాద్ శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ, గద్దె క్రాంతి వీర్, వరహాలు, శివ పాల్గొన్నారు.

జాన్‌బాబు మృతికి సంతాపం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేశ్వరానికి చెందిన ప్రముఖ న్యాయవాది బి.జాన్ బాబు మృతికి ప్రత్తిపాడు న్యాయమూర్తి ఎల్.గోపీనాథ్, న్యాయవాదులు సంతాపం తెలిపారు. ఏలేశ్వరంలో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది జాన్‌బాబు సోమవారం శ్వాసకోస వ్యాధితో మృతి చెందారు. విషయం తెలుసుకున్న న్యాయమూర్తి ఎల్.గోపీనాథ్, ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ న్యాయవాదులు జాన్‌బాబు ఇంటికి చేరుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ జాన్ బాబు ప్రతిభగల న్యాయవాదే కాక మృదుస్వభావి కూడా అని కొనియాడారు. ఆయన వెంట ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కొల్లా వీర్రాజు, అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, పూర్వ అధ్యక్షుడు చలంకూరి రామకృష్ణ, బొగతా శివ, న్యాయవాదులు పిల్లి బలరాముడు, కాళీ ప్రసాదరావు, బొంగుళూరి మధుబాబు, పలివెల నాగేంద్ర ఉన్నారు.

ఐఎల్ఎ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాకినాడ

న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఐఎల్ఎ క్యాలెండర్‌ను సోమవారం కాకినాడ బార్ అసోసియేషన్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎల్ఎ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.పృథ్వీరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయవాదులందరికీ రూ.10 లక్షల చొప్పున జీవిత బీమా కల్పించాలని, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి చెక్కపల్లి చంటి, సీనియర్ న్యాయవాదులు జివి.కృష్ణ, ప్రకాష్, ఎంసిహెచ్ మూర్తి, పి.ప్రసన్న కుమార్, యనమల రామం, కె.వీరభద్రరావు, అల్తాఫ్ అహ్మద్, కోలా శ్రీహరి, జెవి రమణ పాల్గొన్నారు.

సగర సంఘం నేత రాయుడు మృతి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రత్తిపాడు మండలం చిన్నశంకర్లపూడి గ్రామానికి చెందిన సగర సంగం నాయకుడు ములికే రాయుడు ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సగర సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు ములికే సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు గుర్రపు మహాలక్ష్మిరావు, జిల్లా ఉపాధ్యక్షులు చనిబోయిన నాగేశ్వరరావు, బిసి సంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు రాయుడు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని వారు తెలిపారు.

గ్రామీణ సంస్కృతులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-పెదపూడి

గ్రామీణ సంస్కృలను ప్రోత్సహించాడానికి ముగ్గుల పోటీలు దోహద పడతాయని పెదపూడి ఎస్ఐ ఎస్.తులసీరామ్ అన్నారు. పెదపూడిలో భారత మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ యూత్ అధ్వర్యంలో క్రిస్మస్ వేడుక, మహిళలకు ముగ్గుల పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తులసిరామ్, సర్పంచ్ కలవల కృష్ణమూర్తి, ఎంపిటిసి సభ్యురాలు వల్లూరి మరియమ్మ పాల్గొన్నారు. విజేతలకు, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

యానాం వార్తలు

రోడ్డు నిర్మాణ పనుల వద్ద అధికారులతో మాట్లాడుతున్న మల్లాడి

గ్రామాల్లో మల్లాడి కృష్ణారావు పర్యటన

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పలు గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక భీమ్‌నగర్‌లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. రామాలయం ఆలయ నిర్మాణం, అంబేద్కర్ విగ్రహంపైన గొడుగు నిర్మాణం, శ్మశాన వాటిక అభివృద్ధి, కమ్యూనిటీ హాల్ నిర్మాణం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. పెద్దిరెడ్డి గార్డెన్‌లో రోడ్డు నిర్మాణ పనులపను మల్లాడి పరిశీలించారు. మెట్టకూర్ క్రికెట్ మైదానాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మెట్టకూరు గణపతి నగర్ వద్ద ఉన్న ప్రకాష్ కాలనీలో ఒఎన్‌జిసి నిధుల ద్వారా చేపడుతున్న రోడ్ల నిర్మాణాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పిడబ్ల్యుడి, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

గ్రామ పెద్దలను సత్కరించిన యువకులు

రమాబాయి నగర్ పెద్దలకు సత్కారం

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు రమాబాయినగర్ లో గ్రామ పెద్దలకు యువతీ, యువకులు సోమవారం ఆత్మీయ సత్కారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సంక్రాంతికి ముందు ఏటా గ్రామంలోని పెద్దలు, మహిళలను, ఉద్యోగులను ఘనంగా సత్కరించడం అనవాయితీ అన్నారు. అనంతరం గ్రామస్తులకు విందు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. యాళ్ల వెంకట్ కుమార్, కొట్నాల రోహిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు, మహిళలు పాల్గొన్నారు.

బియ్యంను పరిశీలిస్తున్న ఆర్ఎఒ

ఉచిత బియ్యం నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి - యానాం

రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసే ఉచితబియ్యం నాణ్యతను సోమవారం ఆర్ఎఒ అంకిత్ కుమార్ తనిఖీ చేవారు. స్థానిక సుముఖ రైస్ మిల్లు నుంచి లోడు అవుతున్న బియ్యం నాణ్యతతో పాటు బ్రేకేజీ టెస్ట్ సైతం నిర్వహించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా పంపిణీ ఆవుతున్న బియ్యం నాణ్యత కలిగి ఉండాలని ఆవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు.

పిల్లలతో కత్తుల పట్టిస్తారా : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఇటీవల జగన్ పుట్టినరోజు వేడుకల్లో జరిగిన పైశాచికత్వం చూసి షాక్ అయ్యానని, రాజకీయాలంటే ఏంటో తెలియని చిన్న పిల్లలతో కత్తులు పట్టించి, నడిరోడ్డుపై మేక పోతులను బలిస్తూ, రక్తం చల్లుతూ 'రప్పా రప్పా' అంటూ తిరగడం ఏంటని ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రశ్నించారు. ఇది వారి విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. వారి ఇంట్లో పిల్లల చేత కూడా ఇలాగే కత్తులు పట్టిస్తారా అని ఆయన ప్రశ్నించారు. స్థానిక ఆర్యాపురం టింబర్ మర్చంట్ అసోసియేషన్ హాల్లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జగన్ తన పిల్లలను లండన్ ఇతర దేశాల్లో చదివిస్తున్నారని, వారి పిల్లలు బాగుండాలి, మిగిలిన వారి పిల్లలు కేసుల్లో ఇరుక్కుని జైళ్ల చుట్టూ తిరగాలనే రీతిలో ఆయన వ్యవహారం ఉందన్నారు. గత వైసిపి హయాంలో బాధితులకు సిఎంఆర్ఎఫ్ చెక్కు ఒక్కటి కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. తాము తెచ్చిన ప్రతి రూపాయికీ లెక్క ఉందన్నారు. ఎవరైనా వెళ్లి వెరిఫై చేసుకోవచ్చున్నారు. అనంతరం అర్హులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. కొత్త సంవత్సరం వేడుకల్లో పోలీసుల నిబంధనలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు మజ్జి రాంబాబు, కాశీ నవీన్ కుమార్, వై.శ్రీను, వర్రే శ్రీనివాసరావు, రెడ్డి మణేశ్వరరావు, నక్కా చిట్టిబాబు, ఉప్పులూరి జానకిరామయ్య, బుడ్డిగ రవి, కంటిపూడి శ్రీనివాస్, కంటిపూడి రాజేంద్రప్రసాద్, నందివాడ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వాసు

నల్లజర్లలో పార్డ్ ఇండియా సభ్యుల ప్రతిజ్ఞ

ప్రజాశక్తి- నల్లజర్ల

పదిహేనేళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్న 'పార్డ్ ఇండియా' స్వచ్ఛంద సేవా సంస్థ సేవ నూతన సంవత్సరంలో మరింతగా సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామంటూ కేక్ కట్ చేసి ప్రతిజ్ఞ చేశారు. నల్లజర్లలోని పార్డ్ ఇండియా కార్యాలయంలో సోమవారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకులు బేతాళ వీరాస్వామి ఆశయ సాధన నెరవేర్చేలా గ్రామీణప్రాంత ప్రజల సేవలను మరింత విస్తృతం చేయాలని నిర్ణయించారు. సంస్థ మండలాధ్యక్షులు మహ్మద్ ఇలియాజ్ షరీఫ్ మాట్లాడుతూ, గ్రామీణ మహిళల స్వతంత్ర ఆర్థిక పరిపుష్టికి ఆలంబనగా నిలిచేందుకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణను ఇస్తూనే, దాతల సహకారంతో నిరాధారమైన వారికి కుట్టుమిషన్లను సైతం అందజేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నామన్నారు. పల్లెటూర్లలోని చదువుకునే పిల్లలకు బడి తర్వాత విద్యాబోధన చేస్తూ, వారి ఉన్నతికి కృషి చేస్తూ విద్యాధానం మహత్తును చాటుతున్నామన్నారు. విద్యార్థుల మనో వికాసానికి టాలెంట్ టెస్టులు, స్కాలర్‌షిప్ టెస్టులు అదేవిధంగా పలు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో చదుకుని ఉద్యోగప్రయత్నాల్లో ఉన్న యువత ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం ద్వారా మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకునేలా సాయపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ముఖ్య కోశాధికారి సోమశెట్టి వెంకట్రావు, ప్రతినిధి ఎంఎస్ఎస్.రాంబాబు, కుట్టు శిక్షణ శిక్షకురాలు పెనుగొండ కృష్ణవేణి, టెక్నాలజీ విభాగం ప్రతినిధి గాలంకి హేమకుమార్ తదితరులున్నారు.

వచ్చే ఏడాదిలోపు వేయి ఉద్యోగాల కల్పన

ప్రజాశక్తి- గోపాలపురం

నియోజకవర్గం లోని యువతి, యువకులకు వచ్చే ఏడాది చివరి లోపు వెయ్యి ఉద్యోగాలు కల్పిస్తామని ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. సోమవారం గోపాలపురంలో జరిగిన సమావేశంలో వైసిపికి చెందిన ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, వైస్ ఎంపిపి బి.నారాయణమ్మ, వైస్ ప్రెసిడెంట్ వింత ప్రసాద్‌రెడ్డి, సాప్ మాజీ డైరెక్టర్ కప్పల వరలక్ష్మిలతో సహా 60 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు ఎంఎల్ఎ ఆధ్వర్యంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వారికిటెంఎల్ఎ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నానన్నారు. అవినీతికి, కక్ష సాధింపులకు తావు లేకుండా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సిఎం ఆశీస్సులతో పరిశ్రమలు తీసుకొచ్చేందుకు, యువతకు ఉద్యోగ కల్పనకు ప్రయత్నం చేస్తానన్నారు. ఇటీవల నల్లజర్ల మండలంలో జగన్ ఫ్లెక్సీకి మేకను బలిచ్చి రక్తాభిషేకం చేశారని, విద్వేషాలు సృష్టించేందుకు ప్రయత్నించారన్నారు. వారికి ట్రైలర్ వెర్షన్ మాత్రమే చూశారని, మార్పు తెచ్చుకోకపోతే అసలు సినిమా ముందు ఉందని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విగాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొర్లపాటి రాము, భూ రెడ్డి వాసు, జ్యేష్ఠ శ్రీధర్, రొంగల సత్యనారాయణ, గద్దె హరిబాబు, వడ్లమూడి రమేష్, కాట్రగడ్డ సురేష్, ముత్యాల రాయుడు, నందమూరి సత్యనారాయణ, యంత్రప్రగడ జ్యేష్ఠ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


టిడిపిలోకి చేరిన వారితో ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్రాజు

అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన

ప్రజాశక్తి - కొవ్వూరు

తోగుమ్మి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా రూ. 10 లక్షలతో మంజూరైన సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. పిఎంఎవై ద్వారా రూ.20 లక్షలతో నిర్మించే సిసి డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మాజీ వైస్ ఎంపిపి మద్దిపాటి వీరవెంకట సత్యనారాయణ, టిడిపి సీనియర్ నాయకుడు యువి.నారాయణ, టిడిపి జిల్లా కార్యదర్శి మరపట్ల కళాధార చక్రవర్తి, టిడిపి మండల అధ్యక్షుడు బేతిన నారాయణ, వేమగిరి వెంకట్రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్.చిన్ని, తోరం నగేష్, ఉప్పులూరి శేఖర్, అబోతు రాజేష్, జొన్న బాలకృష్ణ, ప్రత్తిపాటి వెంకట సుబ్బారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు..

శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ ముప్పిడి

CHANGE OF NAME

I, **BOJJA VARAHALA RAO** (New Name),aged 55 Years , S/o (Late) Bojja Apparao Resident of Address: D.NO. 16-42-47/A,5th Street, Sambamurthy Nagar, Kakinada (Urban) Kakinada District, A.P. I have Changed My Name From BOJJA VARAHALU (Old Name). To **BOJJA VARAHALA RAO** (New Name) Hence Forth I Will be Called as **BOJJA VARAHALA RAO** (New Name) For all Purpose.

దస్తావేజు పోయినది

నా క్లయింట్ **అయినపర్తి శ్రీనివాస్**, తండ్రి : **సూర్యారావు** (లేటు), డోర్ నెం.1-30, వేలివెన్ను, ఉండ్రాజవరం మండలం, తూ.గో.జిల్లా. నా తండ్రి క్రియ దస్తావేజు 2/12/1969లో డాక్యుమెంట్ నిడదవోలు సబ్ రిజిష్టర్ కార్యాలయంలో రిజిష్టర్ కాబడినది. 1984లో మా ఇల్లు అగ్ని ప్రమాదమునకు గురై దస్తావేజు కాలిపోయినది. తేది.27-06-1994లో నిడదవోలు సబ్ రిజిష్టర్ ఆఫీసులో అప్లై చేయగా నకలు కాపీ ఇవ్వటం జరిగింది. ది.20-03-2021 మా తండ్రి గారు వీలునామా పత్రం 38/2021 నిడదవోలు సబ్ రిజిష్టర్ ఆఫీసులో వ్రాయడం జరిగింది. ఈ డాక్యుమెంట్ పై ఎవ్వరికి ఏవిధమైన హక్కులు లేవని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

జంగం వెంకటేశ్వరరావు
అడ్వకేట్, తణుకు, సెల్ : 9849559601

PASSPORT MISSING

I, Yalamanchili Sathibabu, S/o. Somanaidu, D.No.3-36, Anjaneyaswami Temple Street, Near Railway Station, Kaldari, Undrajavaram Mandal, E.G.Dist., A.P., I lost my **Passport No.L6945075,** while i am travelling from Home to Xerox shop on Motor Bike on **Dt.20-12-2025.** If any one found please **Call : 63015 54706.**

IN THE COURT OF III ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE, KAKINADA
A.S.No.139/2025 in O.S.No.438/2015

Between :
Palivela Santosh Kumar,
S/o.Late Arjun Rao, Aged 66 years, Real Estate business, R/o. D.No.6-1, Indrapalem, Kakinada, Kakinada Rural Mandal.
..Appellant/Defendant
and
Vanga Mounika,
W/o.Vanga Raghavendra Deepak, D/o. Baka Venkata Baka Venkateswara rao, aged 34 years, R/o.H.No.2-43-17, Faces Beauty Clinic, Bhaskara Nagar, Kakinada, E.G.Dt., Rep by her General Power of Attorney Holder, **Baka Venkateswara rao,**
S/o. (Late) Narasimha Murthy, aged 63 years, R/o. Qrt.No.E-22, Heavy Water Plant Colony, Aswapuram, Khammam District, A.P.
...Respondent/Plaintiff

పై నెంబర్ కేసు / అప్పీల్ AS.No.139/2025 in O.S.No.438/2015 లో కోర్ట్ వారి ఆర్డర్ ప్రకారం ఎన్ని పర్యాయములు అప్పీల్ నోటీసు పంపినప్పటికీ మీరు అనగా రెస్పాండెంట్ / ప్రతివాది Vanga Mounika, Rep by her GPA Holder Baka Venkateswara rao అందుకోనందున కోర్టు వారి ఆర్డర్ ప్రకారము మీకు ఈ పేపర్ ప్రకటన ద్వారా పై అప్పీల్ / కేసు **తేదీ.19-01-2026 న 10.30 నిమిషములకు** వాయిదా వున్నదని కావున మీరు గానీ లేదా మీ ప్లీడర్ గారి ద్వారా గానీ కోర్టులో తేదీ.19-01-2026 న హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపర్చుకోవలెను, లేని యెడల మీరు అనగా రెస్పాండెంట్ / ప్రతివాది పరోక్షమందు పై కేసు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

వక్కలంక సత్యనారాయణమూర్తి
M(T).రాజశ్రీ, T.S. రత్నాకర్, అడ్వకేట్స్,
డో.నెం. 7-9-29, సాంబమూర్తి వీధి,
రామారావుపేట, కాకినాడ. సెల్: 9849012112